క్లుప్తంగా

మెకానిక్ కుటుంబానికి ఆర్థిక సాయం



నగదు అందిస్తున్న యూనియన్ నాయకులు

రాపూరు: మండలంలోని ఓబులాయిపల్లి వద్ద జూన్ 23న జరిగిన రోడ్డు ప్రమాదంలో రాపూరుకు చెందిన టూవీలర్ మెకానిక్ నగిరివేణు (48) మృతి చెందాడు. ఈ నేపథ్యంలో విక్రమ సింహపూరి టూ వీలర్ మెకానిక్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు ఆదివారం రాపూరులోని వేణు ఇంటికి చేరుకుని పిల్లల చదువుల నిమిత్తం రూ.20 వేలు ఆర్థిక సాయం అందించినట్లు జిల్లా అధ్యక్షులు అన్వర్ బాషా తెలిపారు. వేణు మృతి చెందడంపై ఆయన సంతాపాన్ని తెలిపారు. ఆయన వెంట జిల్లా ఉపాధ్యక్షులు రఫి, రాపూరు మండల గౌరవాధ్యక్షులు ఖాదర్ బాషా, మండలాక్షులు రియోజ్‌బాషా, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

కాలువ పనులు ముమ్మరం



కొనసాగుతున్న కాలువ పనులు

పెళ్లకూరు: మండలంలోని పునబాక గ్రామంలో ఉన్న వ్యవసాయ కాలువ కాంక్రీట్ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. గ్రామంలోని తెలుగు గంగ 7వ బ్రాంచ్ కాలువ నుంచి పొలాలకు వెళ్లే పంట కాలువకు కాంక్రీట్ పనులకు సంబంధించి రూ.40 లక్షలు నిధులు మంజూరయ్యాయి. పనులు పూర్తయితే సుమారు వెయ్యి ఎకరాలకు సాగునీరు అందుతుందని స్థానిక రైతులు ఆశిస్తున్నారు.

బంకుల్లో పెట్రోల్ ఖాళీ



గోమతి సెంటర్‌లో ఆయిల్ లేని పెట్రోల్‌బంక్

పెళ్లకూరు: మండలంలోని గోమతి సెంటర్, పెన్నేపల్లి, పెళ్లకూరు ప్రాంతాల్లో నాలుగు పెట్రోల్ బంకులు ఉన్నాయి. అయితే గత కొంత కాలంగా బంకుల్లో పెట్రోల్ అందుబాటులో లేకపోవడంతో వినియోగదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా పెళ్లకూరు, పెన్నేపల్లి ప్రాంతాల్లో ఉన్న రెండు బంకులు పూర్తిగా మూసివేశారు. గోమతి సెంటర్‌లో ఉన్న ఓ పెట్రోల్ బంకులో వారానికి నాలుగు రోజులు ఆయిల్ అందుబాటులో ఉండడం లేదు. నిబంధనలు పాటించని పెట్రోల్‌బంకు లైసెన్సులను రద్దు చేసి కొత్త వారికి అవకాశం కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.


ఏడు బైక్‌లు, ఆటో స్వాధీనం



ప్రకాశం కాలనీలో తనిఖీలు చేస్తున్న పోలీసులు

కోట: విద్యానగర్ ప్రకాశం కాలనీలో ఆదివారం పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. వాకాడు సీఐ హుస్సేన్‌బాషా ఆధ్వర్యంలో కోట, వాకాడు, చిట్టమూరు మండలాల ఎస్‌ఐలు పవన్‌కుమార్, నాగబాబు, బలరామయ్య కార్డెన్ అండ్ సెర్చ్‌లో పాల్గొన్నారు. ప్రకాశంకాలనీని జల్లెడ పట్టి ఇంటింటి తనిఖీలు చేశారు. అనుమానాస్పదంగా ఉన్న వారి ఆధార్ కార్డులు, వివరాలు పరిశీలించారు. పోలీసుల తనిఖీల్లో సరైన పత్రాలు లేని ఆటో, ఏడు మోటార్‌బైక్‌లు పట్టుబడినట్లు ఎస్‌ఐ పవన్‌కుమార్ తెలిపారు.

10 వాహనాల స్వాధీనం



కార్డన్ అండ్ సెర్చ్‌లో పట్టుబడిన వాహనాలు

సూళ్లూరుపేట: పట్టణంలోని మహదేవయ్యనగర్, క్రిస్టియన్‌పేటలో ఆదివారం సీఐ మురళీకృష్ణ ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఎలాంటి రికార్డుల్లేని 10 మోటార్‌సైకిళ్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. గంజాయి అమ్మకాలు, గుర్తు తెలియని వ్యక్తుల సమాచారం కోసం ఈ తనిఖీలు చేపట్టారు. పట్టుబడిన 10 వాహనాలకు సంబంధించి సరైన రికార్డులు చూపించి తీసుకోవాలని, లేదంటే వాటిని సీజ్ చేస్తామని సీఐ మురళీకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ బ్రహ్మానాయుడు, తడ ఎస్‌ఐ కొండపనాయు డు, సర్కిల్ పరిధిలోని సిబ్బంది అందరూ పాల్గొన్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు : 14.07.2025

బ్రాయిలర్ లైవ్	:	119
లేయర్ లైవ్	:	112
బ్రాయిలర్ చికెన్	:	216
బ్రాయిలర్ స్కిన్‌లెస్	:	240
లేయర్ చికెన్	:	190

భారీ వాహనం.. ట్రాఫిక్ జామ్





భారీ వాహనంతో జాతీయ రహదారిపై అడుగడుగునా ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. చెన్నైలోని హార్బర్‌కు వచ్చిన అతి పొడవైన ట్యాంకర్‌ను 192 చక్రాలు, 155 అడుగుల పొడవు ఉన్న ట్రాలీ లారీపై ఉంచి నెల్లూరు జిల్లా కృష్ణపట్నం పోర్టుకు బయల్దేరారు. మండలంలోని తల్లంపాడు గ్రామ సమీపంలో టోల్‌ప్లాజా వద్ద అనుమతిలేక మూడు రోజుల పాటు ఆగిపోయింది. ఎట్టకేలకు ఈ భారీ వాహనం ఆదివారం దొరవారిసత్రం దాటింది. ఈ వాహనానికి వెనుక, ముందు భాగంలో ఉన్న 20 మంది సిబ్బంది పలు చోట్ల రహదారి పైనుంచి వెళ్లే విద్యుత్ తీగలను పైకి ఎత్తి పట్టుకుంటూ వాహనాన్ని ముందుకు నడిపిస్తున్నారు. ఆ సమయంలో దొరవారిసత్రం, కుప్పారెడ్డిపాళెం, పోలిరెడ్డిపాళెం, నెలబల్లి తదితర ప్రాంతాల్లో చెన్నై నుంచి నెల్లూరు వైపునకు వెళ్లే వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. -దొరవారిసత్రం

నిత్యాన్నదాన పథకానికి విరాళం



విరాళం అందజేస్తున్న దాతలు

సూళ్లూరుపేట: పట్టణంలోని శ్రీ చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి గూడూరుకు చెందిన సోమిశెట్టి చెంచురామయ్య వారి కుటుంబ సభ్యులు రూ.1,01,116 లక్షలను విరాళంగా సహాయ కమిషనర్ అండ్ కార్యనిర్వహణాధికారి బీ ప్రసన్నలక్ష్మీకి ఆదివారం అందజేశారు. తమ మొక్కు మేరకు ఈ విరాళాన్ని అందజేశామని దాతలు చెప్పారు.

18న శాకాంబరి అలంకారం

చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారు ఈనెల 18న శాకాంబరి అలంకారంతో భక్తులకు దర్శనం ఇవ్వనున్నట్లు ఈఓ ప్రసన్నలక్ష్మీ తెలియజేశారు. ఈ అలంకారంలో ప్రతి ఒక్క భక్తులను భాగస్వాములు కావాలని కోరారు. అందులో భాగంగా మూడు రకాల కూరగాయలు, రెండు రకాల పండ్లు భక్తుల నుంచి స్వీకరించనున్నట్లు ఆమె తెలిపారు. ఈ కూరగాయలు, పండ్లు ఈ నెల 16వ తేదీ సాయంత్రం లోపు ఆలయంలోని కార్యాలయానికి అంజేయాలని కోరారు.

భారీ వాహనాల అడ్డగింత



నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

చిల్లకూరు : తీర ప్రాంతంలో చేపట్టిన సాగరమాల రహదారి నిర్మాణ పనుల కోసం మట్టి, గ్రావెల్, ఇసుక, సిమెంట్ మిక్స్ తరలించే భారీ వాహనాలను ఏరూరు గ్రామస్తులు ఆదివారం అడ్డుకున్నారు. దీంతో కిలోమీటర్ల మేర వాహనాలు ఆగిపోయాయి. భారీ వాహనాల రాకపోకల వల్ల రోడ్లు ధ్వంసమైపోయాయని గ్రామస్తులు చెప్పారు. రోడ్డుపై తేలిన రాళ్లు పక్కనే ఉన్న ఇళ్లలోకి వచ్చి పడుతున్నాయని వాపోయారు. గతంలో వాహనాలను అడ్డుకోగా కాంట్రాక్టు సంస్థ ప్రతినిధులు వచ్చి దుమ్ము, ధూళి రాకుండా రోడ్డుపై నీటిని చల్లుతామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. అయితే గత నాలుగు రోజులుగా నీటిని చల్లకపోవడంతో మళ్లీ ఇబ్బందులు మొదలయ్యాయని చెప్పారు.

ఇంటింటికీ చంద్రబాబు మోసం



సమావేశంలో మాట్లాడుతున్న కిలివేటి సంజీవయ్య

నాయుడుపేటటౌన్ : ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా చంద్రబాబు చేసిన మోసాన్ని ఇంటింటికీ తెలియజేయాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య సూచించారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు సంజీవయ్య సారథ్యంలో పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు కలికి మాధవ రెడ్డి, ఒట్టురు కిషోర్ యాదవ్ అధ్యక్షతన స్థానిక పార్టీ కార్యాలయం వద్ద ఆదివారం సాయంత్రం మున్సిపాలిటీ, మండల నాయకులతో కలిసి బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఆ బాండ్లు ఏమయ్యాయి?

గత ఎన్నికల్లో కూటమి నాయకులు ప్రతి ఇంటి వద్దకు వెళ్లి వారు అమలు చేసే పథకాలకు సంబంధించి క్యూ ఆర్ కోడ్ కలిగిన బాండ్లు పంపిణీ చేశారని, అవి ఇప్పుడు ఏమయ్యాయని సంజీవయ్య ప్రశ్నించారు. అయితే ఆ హామీలు అమలు చేయకపోవడంతో ఆ బాండ్లను గుర్తు చేసేలా ప్రతి ఇంటి వద్దకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వెళుతోందన్నారు. కూటమి సాగిస్తున్న అరాచక పాలనను ప్రజలకు తెలియజేసేందుకు అందరూ కంకణబద్దులు కావాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షులు తంబిరెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డి, పట్టణ మండల అధ్యక్షులు కలికి మాధవ రెడ్డి, ఒట్టురు కిషోర్ యాదవ్ ప్రసంగించారు. క్రిస్టియన్ మైనారిటీ సెల్ జిల్లా కన్వీనర్ కె.భావన్ అనుదీప్, మెస్ భాస్కర్ రెడ్డితోపాటు నాయకులు కట్టా భవాని శంకర్ రెడ్డి, కటకం జయరామయ్య, దారా రవి.దొంతాల రాజశేఖర్ రెడ్డి,పాపారెడ్డి చంద్రా రెడ్డి, పాలేటి నాగార్జున, గంధవళ్లి సిద్దయ్య, ఈదా రత్నశ్రీ, హారతి రెడ్డి, షేక్ షబ్బీర్, నాగిరెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి, బత్తిన రమణయ్య, నల్లూరు ప్రకాశ్, ఆర్కాట్ శాంతకుమార్, పేర్నాటి రాహుల్ , నిడిగింటి చిట్టిబాబు, ఆకుతోట సుబ్బారెడ్డి, సన్నరెడ్డి సురేష్ రెడ్డి పాల్గొన్నారు.

వేడుకగా సుబ్రమణ్యేశ్వర స్వామి కల్యాణం



అలంకరణలో ఉన్న స్వామివారు

చిట్టమూరు: మండల పరిధిలోని మల్లాం గ్రామంలోని వల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం స్వామి, అమ్మవార్ల శాంతి కల్యాణం వేడుకగా నిర్వహించారు. ఉదయం స్వామి వారి మూల విరాట్‌కు అభిషేకాలు చేసి, విశేష అలంకరణ చేశారు. స్వామి, అమ్మవార్లకు పలు రకాల పుష్పాలతో అలంకరించి లోక కల్యాణార్థం శాంతి కల్యాణాన్ని ఆలయ పురోహితులు మూలంరాజు భానుప్రకాష్ శర్మ వేద మంత్రోచ్చరణతో నిర్వహించారు. కుజదోషం ఉన్న వారు ఆలయంలో హోమాలు వేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచి పెట్టారు. మధ్యాహ్నం దేవస్థానం వారిచే అన్నదానం చేశారు.

కొలుపు.. కోలాహలం



మండల కేంద్రంలోని గంగమ్మ ఆలయంలో ఆదివారం గంగమ్మ కొలుపు కోలాహలంగా ప్రారంభమైంది. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకున్నారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు, పూలంగిసేవ నిర్వహించారు. అనంతరం ఆలయం ఎదుట మైల ముగ్గువేసి అమ్మవారికి దిష్టితీశారు. ఉదయం 9 గంటలకు మహిళలు అమ్మవారికి పొంగళ్లు పెట్టేందుకు కొత్త గంపలో కట్టెలు, పొంగళ్లకు కావలసిన సామగ్రితో ఆలయానికి చేరుకున్నారు. ఆలయం చుట్టూ మూడు ప్రదక్షిణలు చేసి ఆలయం ముందు భాగంలో పొంగళ్లు పెట్టి నైవేద్యాన్ని అమ్మకు సమర్పించారు. అమ్మవారి దర్శనానికి మండలంలోని ప్రజలు తరలివచ్చారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. దీంతో ఆలయం కోలాహలంగా మారింది. కొలుపు సందర్భంగా రాపూరులో సందడి నెలకొంది. - రాపూరు







10 ఎకరాల సవక తోట దగ్ధం



కాలిపోయిన సవక తోట

సైదాపురం: విద్యుత్ తీగలు తెగిపోవడంతో మంటలు చెలరేగి 10ఎకరాల సవక తోట కాలిపోయింది. ఈ సంఘటన మండలంలోని గిద్దలూరులో ఆదివారం చోటు చేసుకుంది. రైతులు తెలిపి వివరాల మేరకు, మండలంలోని గిద్దలూరు గ్రామంలో కంభం శ్రీకాంత్‌తో పాటు మరో ఐదుగురు రైతులు సుమారు 100 ఎకరాల సవక తోటలను సాగు చేస్తున్నారు. ఈ తోట సమీపంలోనే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. అక్కడ తరచూ విద్యుత్ వైర్లు ఒకదాని కొకటి రాసుకుని మంటలు వాపిస్తుంటాయి. దీనిపై రైతులు పలుమార్లు విద్యుత్ శాఖ అధికారులకు మొర పెట్టుకున్నారు. అయినా ప్రయోజనం లేదు. ఈ క్రమంలోనే ఆదివారం ఉదయాన్నే విద్యుత్ వైర్లు రాసుకుని మంటలు రావడంతో సవక తోటలోకి మంటలు వ్యాపించాయి. సుమారు 10 ఎకరాల సవక తోట బూడిదైపోయింది. వెంటనే రైతులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు హుటాహుటిన అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేశారు. సుమారు రూ.5 లక్షల మేర పంటకు నష్టం సంభవించిందని రైతులు తెలిపారు.

రోడ్లు వేశారు.. బరంచులు మరిచారు



దళితవాడలో బరంచులు లేని సీసీ రోడ్డు

వాకాడు: మండలంలో ఇటీవల పలు గ్రామాల్లో సీసీ రోడ్లు వేశారు కానీ రోడ్డుకు ఇరువైపులా గ్రావెల్‌తో బరంచులు వేయడం మరిచపోయారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా వేసిన రోడ్లు నాణ్యత లేకపోగా వేసిన రోడ్డుకు ఇరువైపులా అంచులకు మట్టి వేయకపోవడంతో రాత్రి పూట ప్రజలు ప్రమాదాలకు గురవుతున్నారు. రోడ్డు ఎత్తుగా ఉండడంతో వాహన చోదకులు, పాదచారులు రోడ్డు అంచుకు వచ్చి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గురుకుల పాఠశాల సమీపంలో వేసిన సీసీ రోడ్డుకు ఇరువైపుల గ్రావెల్ వేయకపోవడంతో స్కూల్ వద్దకు వచ్చే ఆటోలు, వ్యాన్‌లు పక్కకు తొలగలేక ప్రమాదాలకు గురవుతున్నాయి.

చెట్ల మధ్యలో విద్యుత్ తీగలు

దొరవారిసత్రం: కలగుంట ఎస్టీ కాలనీలో ఎల్‌టీ లైన్ చెట్ల మధ్యలో వెళ్లడం వలన గాలు వీచిన సమయంలో విద్యుత్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని వినియోదారులు తెలిపారు. తరచూ లోఓల్టేజీ సమస్య అధికంగా ఉందని కాలనీవాసులు వాపోయారు. ట్రీ కటింగ్, నిర్వహణ పేరుతో ట్రాన్స్‌కో అధికారులు శని, ఆదివారాల్లో గంటల తరబడి విద్యుత్ కోతలు విధిస్తారు. అయిన విద్యుత్ సరఫరాకు అంతరాయం మాత్రం తప్పడం లేదు. ఆదివారం కూడా డీవీ సత్రం, తల్లంపాడు, పూలతోట 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో ట్రీ కటింగ్ పేరుతో ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ నిలిపివేశారు. కానీ కలగుంట ఎస్టీ కాలనీ వద్ద విద్యుత్ తీగలు చెట్ల మధ్యలోనే ఉండడం గమనార్హం.



యథేచ్ఛగా గ్రావెల్ తవ్వకాలు



కుప్పాయిపాళెం చెరువులో టిప్పర్లకు గ్రావెల్ నింపుతున్న జేసీబీ

దక్కిలి: మండల కేంద్రంలోని పెద్ద చెరువు నుంచి అక్రమంగా తవ్వకాలు చేపట్టి, దేవునివెల్లంపల్లి వెళ్లే మార్గంలో ఆదివారం పెద్ద వాహనాల్లో గ్రావెల్ తరలిస్తున్నారు. చెరువుల్లో పెద్ద పెద్ద గుంతలుగా ఏర్పడి బావులుగా మారుతున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు. ఇంత పెద్ద ఎత్తున భారీ వాహనాలతో గ్రావెల్ తరలిస్తున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. స్థానికులు ఇంటి నిర్మాణానికి తట్టెడు మట్టి తీసుకుంటే అధికారులు అనేక రకాలుగా ఇబ్బందులకు గురి చేస్తారని, అలాంటిది లారీలకు లారీలు కళ్ల ముందే వెళుతున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై తహసీల్దార్ శ్రీనివాసులను వివరణ కొరగా ఈ విషయం తన దృష్టికి రాలేదని చెప్పారు.